ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 31 ఆగస్టు 2024



బదిలీ వర్కర్లకు సింగరేణి సీఎండీ తీపి కబురు 8లో..

కొత్త గనుల విషయంలో స్పష్టత ఇవ్వాలి 8లో..

బీ థర్మల్ విస్తరణపై ఆశలు



రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం

- ఎప్పటి నుంచో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రతిపాదనలు
- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్
- ఇటీవల ప్లాంట్‌ను సందర్శించిన జెన్‌కో డైరెక్టర్లు, టెక్నికల్ టీం
- నేడు సందర్శించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రామగుండం బీ థర్మల్ పవర్ ప్లాంట్ విసర్తణపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఈ ప్లాంటును విస్తరించి 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలనే ప్రతిపాదన ఉంది. కానీ అడుగులు ముందుకు పడడం లేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, రామగుండం నుంచి అదే పార్టీకి చెందిన రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో బీ థర్మల్ విద్యుత్ కేంద్రం విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఆయన ఎన్నికల సందర్భంగా బీ థర్మల్ విస్తరణకు కృషి చేస్తానని హామీ కూడా ఇచ్చారు. ఆ మేరకు ఆయన ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ఈనెల 31న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించనుండడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఆయన పర్యటనలో భాగంగా బీ థర్మల్ విద్యుత్ ప్లాంటును కూడా పరిశీలించనున్నారు. బొగ్గు, నీళ్లు అందుబాటులో ఉండడంతో దీనిని ఫిట్ హెడ్ స్టేషన్‌గా పరిగణనలోకి తీసుకుంటున్నారు. జిల్లాలోని రామగుండంలో 1972 జూన్ 16న, 62.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల బీ థర్మల్ పవర్ ప్రాజెక్టును జెన్‌కో ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ప్లాంట్‌కు దాదాపు 450 ఎకరాల భూములను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. ఈ ప్లాంటుకు 2014 నుంచి వార్షిక మరమ్మతులు చేయని కారణంగా యంత్రాలు పాడై పోయి కాలుష్యం వెదజల్లుతున్నాయి. దేశవ్యాప్తంగా కాలుష్యం ఎక్కువగా వెలువడుతుందన్న కారణంతో సెంట్రల్ ఎలక్ట్రికల్ అథారిటీ(సీఈఏ) తక్కువ సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా బీ థర్మల్ కేంద్రాన్ని కూడా మూసివేయాలని సీఈఏ పేర్కొంది. సీఈఏ సూచన చేయకముందు నుంచే బీ థర్మల్ పాత ప్లాంటును మూసివేసి మరింత భూసేకరణ చేసి 800 మెగావాట్లకు విస్తరించేందుకు సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంటును ఏర్పాటు చేయాలనే ప్రతపాదన ఉంది. ప్లాంటును విస్తరిస్తే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాజీ ఎమ్మెల్యేలు సైతం అప్పటి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నీళ్లు, బొగ్గు, భూమి అందుబాటులో ఉండడంతో కొత్త ప్లాంటు ఏర్పాటుకు అన్ని అవకాశాలున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి అయిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రాలు ఇచ్చి వారిపై ఒత్తిడి తీసుకవస్తున్నారు.

● పునర్విభజన చట్టంలో భాగంగా..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం ఇదే రామగుండం ఎన్టీపీసీలో 4000 మెగావాట్ల విద్యుత్ ప్లాంటును నిర్మించాలని ప్రతిపాదించారు. దీంతో 800 మెగవాట్ల సామర్థ్యం గల 2 యూనిట్ల నిర్మాణం పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి కూడా చేపడుతున్నారు. మిగతా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం గత ప్రభుత్వం పీపీఏ ఇవ్వలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందుకు పీపీఏ ఇవ్వాలని భావించినప్పటికీ వెనక్కి తగ్గింది. 2400 మెగావాట్లకు పీపీఏ చేసుకుంటే ప్రభుత్వంపై తీవ్ర భారం పడుతుందని, ఇతర సంస్థల నుంచి కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరకు విద్యుత్ దొరుకుతుందని భావించిన ప్రభుత్వం పీపీఏ ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దానికి ప్రత్నామ్నాయంగా బీ థర్మల్‌ను విస్తరించినట్లయితే, లాభం జరుగతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. బీ థర్మల్ విస్తరణ ప్లాంటును జెన్‌కో ద్వారా గానీ, జెన్‌కో, సింగరేణి సంస్థలు సంయుక్తంగా గానీ చేపట్లానే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. 800 మెగావాట్ల ప్లాంటు విస్తరణకు 5 వేల నుంచి 6 వేల కోట్ల రూపాయల ఖర్చు కావచ్చని అంచనా. ఇటీవల జెన్‌కోకు చెందిన డైరెక్టర్లు, టెక్నికల్ టీం బీ థర్మల్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలన చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భూమి ఎంత.. ప్లాంటు విస్తరణకు ఎంత అవసరం ఉంటుంది.. తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించినట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రామగుండం పర్యటనలో భాగంగా బీ థర్మల్ పవర్‌ను సందర్శిస్తుండడంపై ప్లాంటు విసర్తణపై ఆశలు చిగురిస్తున్నాయి. అలాగే నాలుగేళ్ల క్రితం మూతపడ్డ మేడిపల్లి ఓసీపీ 4 గనిలో ప్రస్తుతం అర టీఎంసీ నీళ్లు ఉన్నాయి. సంప్‌డ్ పవర్ జెనరేషన్ పద్ధతిలో 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని సింగరేణి సంస్థ ఆలోచన చేస్తున్న నేపథ్యంలో మేడిపల్లి ఓసీపీని కూడా ఉప ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. మొత్తం మీద భట్టి విక్రమార్క పర్యటన ప్రాధాన్యం సంతరించుకున్నది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ధర్మారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 11,291 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 8,056క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 3,235 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇక్కడ నుంచి నంది పంప్‌హౌస్‌లోని 2 మోటార్ల ద్వారా గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 6,300 క్యూసెక్కుల నీటిని, ఎన్టీపీసీ, హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు 316 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మొత్తం ఔట్ ఫ్లో 6616 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.766 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

ఎన్నికల హామీలపై కచ్చితమైన సమాధానం చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే చందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, ఆగస్టు 30: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం రామగుండం పర్యటనకు వస్తున్న సందర్భంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై కచ్చితమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడారు. వట్టి హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచి ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వాటిపై కచ్చితమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడుస్తున్నా హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని, వృద్ధులకు రూ.4వేల పెన్షన్, మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. విద్యార్థులకు స్కూటీలు, ఎక్కడ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా పెంపులాంటి హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతానికి వస్తున్న వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీటన్నింటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రామగుండం అభివృద్ధి కోసం కేసీఆర్ కోట్లాది రూపాయలు వెచ్చించారన్నారు. అంతర్గాం మండల కేంద్రంలో వంద ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాప చేయించామని ఆయన చెప్పారు. రామగుండం ప్రాంతంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సన్నాహాలు చేయడం సంతోషమైన విషయమని, జెన్‌కో ద్వారా విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని ఆయన అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని చందర్ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్ గాదం విజయ, నాయకులు బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజ్, పిల్లి రమేష్, చల్లగురుగుల మొగిలి, నూతి తిరుపతి, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్, గుంపుల లక్ష్మి, యాసర్ల తిమోతి, కోడి రామకృష్ణ, కిరణ్‌జీ, కనకరాజు, వెంకటేష్, రామరాజు, తిరుమల పాల్గొన్నారు.

ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలి

ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ శంకర్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 30: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బొంకూరి శంకర్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 1న సీపీఎస్ పెన్షన్ విద్రోహ దినంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. జిల్లాకేంద్రం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి బస్టాండ్ అంబేడ్కర్ కూడలి మీదుగా తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 54 సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జేఏసీ పిలుపు మేరకు నిర్వహించే నిరసన కార్యక్రమాలకు జిల్లాల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని శంకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీఆర్టీయు టీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్, గుండు కృష్ణమూర్తి, ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మెరుగు సతీష్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు లింగం శ్రీనివాస్, రవికుమార్, జీవన్ రాజు, లక్ష్మణ్, కొమురయ్య, పురుషోత్తం రెడ్డి, ఎడిపెల్లి సంతోష్, బ్రహ్మానందరెడ్డి, ఖదీర్, రాజయ్య, రాజప్రసాద్, మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి పట్టణంలో విజృంభిస్తున్న జ్వరాలు

- ఇంటికి ఇద్దరుముగ్గురు బాధితులు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కిటకిట..



రోగులతో నిండిపోయిన వార్డు



వరండాలో మంచాలపై చికిత్స పొందుతున్న రోగులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 30: పెద్దపల్లి పట్టణంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. నెల రోజులుగా అదుపులోకి రావడం లేదు. ఇంట్లో ఒక్కరికి వచ్చిందంటే అందరికీ జ్వరం సోకుతోంది. రక్తకణాలు తగ్గి డెంగ్యూకు కొందరు గురికాగా, మరికొందరు చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ వందల సంఖ్యలో జ్వర పీడితులు ఓపీ కోసం వస్తున్నారు. జ్వర పీడితుల వందల సంఖ్యలో ఉంటుండడంతో ఆసుపత్రిలో బెడ్లు లేక వరండాలో మంచాలు, కుర్చీలు వేసి చికిత్స చేస్తున్నారు. పరిస్థితులు విషమంగా ఉన్న కేవలం 12 గంటల వరకే ఓపీ సేవలు అందిస్తున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిగా గుర్తింపు పొందినప్పటికి ఆ హోదా కల్పించకపోవడంతో నిత్యం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రోగులను తరలించాల్సి వస్తోంది.

పారిశుధ్య లోపం..

పట్టణంలో పారిశుద్యం లోపించింది. వీధుల్లో నిత్యం మురికి కాలువలు తీయాల్సి ఉండగా వారానికి ఒక్కరోజు కూడా తీయడం లేదు. స్థానికులు చెత్తాచెదారంపై, మురుగునీరు నిల్వలపై సమాచారం ఇచ్చినా మున్సిపల్ సిబ్బంది స్పందించడం లేదు. బ్లీచింగ్, ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పిచ్చిమొక్కలు తొలగింపుపై నిర్లక్ష్యం వహిస్తున్నారు.

దోమలు కుట్టకుండా చూసుకోవాలి

- డాక్టర్ పి మల్లేశం, ఎండీ ఫిజిషియన్

ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వకుండా చూసుకోవాలి. చెత్తచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కిటికీలకు జాలీలు, లేదంటే దోమ తెరలు వాడుకోవాలి. దోమలు కుట్టకుండా చూసుకోవాలి. జ్వరం అనిపించినా, ఒళ్లు నొప్పులు అనిపించినా వెంటనే చికిత్స చేయించుకోవాలి.

‘ఖని’లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

- ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ వందల సంఖ్యలో జ్వర పీడితులు.. - కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 30: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈసారి డెంగ్యూ, చికున్ గున్యాతో రోగులు అవస్థలు పడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు 1200 నుంచి 1400మంది ఓపీ వస్తుండగా అందులో 500 నుంచి 600మంది జ్వర బాధితులే ఉంటున్నారు. చికున్‌గున్యా 16ఏళ్ల క్రితం కోల్‌బెల్ట్‌ను వణికించిన చికున్‌గున్యా మళ్లీ మొదలైంది. వారం రోజులుగా రోజుకు నాలుగు డెంగ్యూ కేసులు నమోదు అవుతుండగా, లెక్కకు మించి చికున్‌గున్యా, వైరల్ ఫీవర్ కేసులు నమోదు అవుతున్నాయి. ఇందులో చాలా మంది ఆసుపత్రిలో అడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు. ఈనెల 19నుంచి 27వ తేది వరకు సుమారు 300మందిని ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. మరికొంత మంది వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, మలేరియాతో బాధపడుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్సకోసం వచ్చిన కొంత మంది రోగులు స్పృహ కోల్పోవడం, కీళ్ల నొప్పులతో కింద కూలబడిపోయారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండడంతో దోమలు పెరిగి పోయి చాలామందికి డెంగ్యూ వ్యాప్తి చెందుతోంది. మధ్యాహ్నం కుట్టే దోమతో చాలామంది డెంగ్యూ బారినపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. ఏ ఆసుపత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతుండగా బెడ్లు సరిపోక అవస్థలు పడుతున్నారు. మరికొంత మందికి ప్లేట్లెట్ల సంఖ్య తగ్గడంతో కరీంనగర్, హైదరాబాద్ వంటి కార్పొరేట్ ఆసుపత్రులకు చికిత్స కోసం తరలిస్తున్నారు. నెలరోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీప్రదేశాల్లో నీటినిల్వలు పేరుకుపోయి దోమలు, ఈగల వ్యాప్తి పెరిగిపోయాయి. కార్పొరేషన్ దోమల నివారణకు ఆయిల్‌బాల్స్, ఫాగింగ్ చేయకపోవడం దోమల వృద్ధికి కారణమవుతున్నాయి.

దోమల బారి నుంచి రక్షించుకోవాలి..

- అజయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్

రోజుకు గోదావరిఖని జీజీహెచ్‌కు వందల సంఖ్యలో జ్వరబాధితులు వస్తున్నారు. అందులో వారం రోజులుగా రోజుకు 2నుంచి 4 డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయి. చికున్ గున్యా కేసులు కూడా ఎక్కువగా ఉన్నాయి. 600నుంచి 700వరకు రోజుకు జ్వరబాధితులు వస్తున్నారు. చాలా మంది చికున్‌గున్యా, వైరల్, టైఫాయిడ్, మలేరియా బాధితులు ఉంటున్నారు. దోమ తెరలువాడాలి, వేడి పదార్థాలు తినాలి, కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికారుల తనిఖీలు



ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

సుల్తానాబాద్, ఆగస్టు 30: సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం ఉద్యోగులు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఆయన బృందం సుల్తానాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేసింది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న చిన్నపిల్లల ఆసుపత్రి, మరో రెండు దంత వైద్యశాలలకు నోటీసులు ఇచ్చి అనుమతులు పొందేవరకు ఆస్పత్రులను మూసి ఉంచాలని ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఆస్పత్రిలో ధరల పట్టిక, వారు అందించే సేవలను, వైద్యం చేసే డాక్టర్ల వివరాలను రిసెప్షన్ కౌంటర్‌లో ప్రదర్శించాలని ఆదేశించారు.

ఉప ముఖ్యమంత్రి సభా ఏర్పాట్ల పరిశీలన



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని, ఆగస్టు 30: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం రామగుండంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో శంకుస్థాపన కార్యక్రమం జరుగనన్నది. అక్కడే సభ ఏర్పాటు చేశారు. వర్షాల దృష్ట్యా సభకు ఆటకం కలుగకుండా రెయిన్‌ప్రూఫ్ షామియానాలు ఏర్పాటు చేశారు. సభ ఏర్పాట్లను శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కార్పొరేషన్ మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్, పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీని వాస్, డీసీపీ చేతన, ఏసీపీ రమేష్ పరిశీలన జరిపారు.

హెచ్ఐవీ స్ర్కీనింగ్ పరీక్షల నిర్వహణపై శిక్షణ

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 30: హెచ్ఐవీ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించడంపై కలెక్టరేట్‌లోని జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో అయుష్మాన్ ఆరోగ్య మందిరం(పల్లెదవాఖాన)ల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు ఒకరోజు శిక్షణ నిర్వహించామని డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శిక్షణనిచ్చామని పేర్కొన్నారు.

ఇల్లందకుంట ఎస్ఐపై ఏసీపీకి ఫిర్యాదు

హుజూరాబాద్, ఆగస్టు 30: ఇల్లందకుంట ఎస్ఐ రాజ్‌కుమార్ అకారణంగా దూషిం చారని, మహిళా కానిస్టేబుల్‌తో కొట్టించారని. తనకు న్యాయం చేయాలని బాధితు రాలు పైడిపల్లి స్వప్న శుక్రవారం ఏసీపీ శ్రీనివాస్‌జికి ఫిర్యాదు చేశారు.ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన తనను ఏడాదిన్నర క్రితం కట్కూరి నాగరాజు అత్యాచార యత్నానికి పాల్పడగా కేసు నమోదు అయిందన్నారు. అది మనసులో పెట్టుకొని తరుచూ నాగరాజు, అతని భార్య సూటిపోటీ మాటలు అనడంతో వారం రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ తననే బూతులు తిట్టారని, అంతేకాకుండా మహిళా పోలీసులతో కొట్టించారన్నారు. తన కు న్యాయం చేయాలని ఏసీపీని కోరగా జమ్మికుంటరూరల్ పోలీస్‌స్టేష న్‌లో సీఐని కలువాలని సూచించినట్లు తెలిపారు. ఎస్ఐపై సీపీకి కూ డా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా బాలికల రోడ్ సైక్లింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బాలికల రోడ్ సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో ఉదయం 7గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మెన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎంపిక పోటీల్లో అండర్-14, 16, 18, 23 అపై వయస్సు విభాగాలలో బాలికలకు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారు లను సెప్టెంబరు 14,15 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించే ప్రాంతీ య స్థాయి ఖేలో ఇండియా పోటీలకు, జనగామలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 31 సాయంత్రం లోపు 9398230614 నంబరులో సంప్రదించాలని కోరారు. పాల్గొనే క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరు కావాలని సూచించారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 79క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,350 రూపాయలు చెల్లించి కొనుగోలు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహన దారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీ లలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు జైలుశిక్ష, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరి మానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారు లకు 35 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని హెచ్చరించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	8,500	5,555	80.5	60.118
ఎల్లంపల్లి	11,291	6,616	20.175	16.766
మిడ్ మానేరు	9,400	21,000	27.54	16.40
ఎల్ఎండీ	14.850	250	24.034	12.107

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ఆశీర్వచనం అందించిన రాజన్న ఆలయ అర్చకులు

- శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు ప్రతిపాదనలు


సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందిస్తున్న రాజన్న ఆలయ అర్చకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి రూ. 50 కోట్ల నిధులు బడ్జెట్‌లో పెట్టడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి నిధులు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేశ్, సురేష్, చందు సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందించారు. రాజన్న ఆలయ విస్తరణ కోసం శృంగేరి పీఠాధిపతులను కలివాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అనుమతులు తీసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు తెలిసింది. వారం రోజుల్లో శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా త్వరలోనే రాజన్న ఆలయాన్ని దేవాదాయశాఖ కమిషనర్‌తో పాటు ప్రభుత్వ కార్యదర్శిలు సందర్శించనున్నట్లు చెప్పారు. సీఎంను కలిసిన వారిలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయశాఖ స్థపతి వల్లియాగం, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పలువురికి జరిమానాలు


జరిమానా రశీదు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: సిరిసిల్ల పట్టణంలోని పుర వీధుల్లో చెత్తను విచ్చల విడిగా పడవేస్తున్న అపరిశుభ్రం చేస్తున్న దుకాణ యజమానులను శుక్రవారం మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు గుర్తించి జరిమానాలను విధించారు. ఒక్కక్కరికి రూ. 500ల నుంచి రూ. 1000 వరకు జరిమానాలు విధించి దుకాణం యజమానులకు జరిమానా రసీద్‌లను మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది అందజేశారు. భవిష్యతు_్తలో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే భారీ జరిమానాలు విధి స్తామని దుకాణ యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉమర్, శేఖర్, దేవయ్య, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు నవోదయం


నవోదయ విద్యాలయం

విద్యతో పాటు నైతిక విలువలకు పెద్ద పీట వేసి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న నవోదయ విద్యాలయాలు నవశకానికి నాంది పలుకుతున్నాయి. ప్రతిభ ఉన్నా చదువు కోలేని గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపుతోంది జవహర్ నవోదయ విద్యాలయం.

» గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యం » ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన

» దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల » సెప్టెంబరు 16 తుది గడువు

చొప్పదండి, ఆగస్టు 30: ఉత్తమ విలువలు, ఉన్నత ప్రమాణాలు, దేశ భక్తి, నైపుణ్యం, క్రీడలలో భాగస్వామ్యం, చదువుతోపాటు సమాజ సేవ ఇవన్నీ నవోదయ విద్యాలయంలోనే సాధ్యం. క్రమశిక్షణకు పెట్టింది పేరైన జవహర్ నవోదయ విద్యా లయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆరు నుంచి 12 వ తరగతి వరకు పూర్తి గా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత విద్యను అంది స్తారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం నవోదయ విద్యాలయ సమితి దేశవ్యాప్తంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

- సీబీఎస్ఈ సిలబస్..

విద్యాలయంలో ఆరో తరగతి నుంచి కంప్యూటర్ విద్యను ప్రత్యేకంగా బోధిస్తారు. సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన, ఆధునా తనమైన సైన్స్ లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, జిమ్ హాల్, క్రీడా మైదానం కలిగి ఉండడం విద్యాల యం ప్రత్యేకతలు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలి. మొక్కలను నాటి వాటి సంరక్షణ విద్యార్థులు చూసుకోవాలి. విద్యార్థులపై ఎలాం టి ఖర్చు లేకుండా పూర్తిగా రెసిడెన్షియల్ ప ద్ధతిలో బోధనను అంది స్తున్నారు. విజ్ఞాన జ్యో తి పథకంలో భాగంగా 9 నుంచి 12వ తరగతి బాలికలకు నీట్, ఐఐటీ కోచింగ్ కోసం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది.

- 80 సీట్లకు గానూ..

విద్యాలయంలో ఆరో తరగతిలో ఉన్న 80 సీట్లు గాను ఉమ్మడి జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 14బ్లాక్‌ల వారీగా దర ఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్ లోనే తమ దరఖాస్తులు చేసుకోవాలి. సెప్టెంబరు 16 తేదీని దరఖా స్తులకు చివరి తేదీగా ప్రకటించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్షను జాతీయస్థాయిలో సీబీఎస్ఈ నిర్వహిసు_్తన్నది. ప్రవేశపరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు తొమ్మిది వేల దరఖాస్తులు రాగా జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచి విద్యాలయం అవార్డును దక్కించుకుంది.

- గ్రామీణ విద్యార్థులకు 75శాతం..

విద్యాలయంలో 80 సీట్లకు గాను75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీల కు, 7.5 శాతం ఎస్టీలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. ప్రవేశ పరీక్ష మార్కులు, మెరిట్, క్యాటగిరి ఆధారంగా సీబీఎస్సీఈ ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తుంది.

అర్హులు దరఖాస్తు చేసుకునేలా..



అర్హులైన ప్రతి విద్యార్థి నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది. దళారుల మాటలు నమ్మి మోస పోవద్దు. విద్యార్థులు కష్టపడి చదివితే సీటు సాధించవచ్చు. ఈ ఏడాది అత్యధికంగా దరఖాస్తులు వచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- మంగతాయారు, ప్రిన్సిపాల్

● ప్రవేశ పరీక్షకు అర్హతలు..

ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు మూ డు నుంచి ఐదో తరగతి వరకు ప్రభు త్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చదవాలి. విద్యార్థి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలి. 2013 మే1 నుంచి 2015 జూలై 31 లోపు జన్మించిన వారే దరఖాస్తులకు అర్హులు. విద్యార్థికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. లేనట్లయితే తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. కాగా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థి తన బ్లాక్ ఎంచుకొని వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. విద్యార్థులు తప్పని సరిగా గ్రామాలకు చెందిన వారే ఉండాలి. చొప్పదండి, కొత్తపల్లి, హుజూరాబాద్, పెద్దపల్లి, మంధని. సుల్తానాబాద్, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లి, జగి త్యాల, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ మున్సిపా లిటీలుగా మారగా ఇక్కడ నివసించే విద్యార్థులు అర్బన్ క్యాటగిరి కిందికి వస్తారు. ఈ ప్రాంత విద్యార్థులు అర్బన్ కోటా కిందనే దరఖాస్తు చేసుకోవాలి.

భారీ వర్షం

●పొంగిపొర్లిన వాగులు ●లోతట్టుప్రాంతాలు జలమయం

జగిత్యాల అర్బన్/జగిత్యాలరూరల్, ఆగస్టు 30 : జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి సగటున 40 మి.మీ వర్షం కురిసింది. అత్యధికంగా మేడిపల్లిలో 86.1 మిల్లీ మీటర్లు, జగిత్యాలలో 84.6, జగిత్యాల రూరల్‌లో 74.4, మల్యాలలో 73.3, రాయికల్ మండలంలో 65.5, మల్లాపూర్ మండలంలో 55.8, పెగడపల్లిలో 42.2, కొడిమ్యాలలో 41.8, మెట్‌పల్లిలో 36.6, కథలాపూర్‌లో 34.2, సారంగాపూర్ మండలంలో 34.2, ఇబ్రహీంపట్నంలో 20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగిత్యాల పట్టణంతోపాటుగా, పరిసర ప్రాంత గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జగిత్యాల జలమయంగా మారింది. వాగులు, లోతట్టు ప్రాంతా ల్లోకి భారీగా వర్షంనీరు చేరుకోవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి, కాలనీల్లోని ఇండ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని గోవిందుపల్లి వాగు, మోతె వాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో గోవిందుపల్లి అవతలివైపు ఉన్న వెంకటాద్రినగర్‌కు సంబంధాలు తెగిపోయాయి. మోతె వాగు పొంగి పొర్లడంతో గొల్లపల్లి నుంచి జగిత్యాలకు రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. నీరు వాగుపైకి భారీగా ప్రవహించడంతో ప్రయాణికులు ఇతర దారి గుండా రాకపోకలు సాగించారు. వెంకటాద్రినగర్ కాలనీకి అత్యవసరం ఉన్నవారిని జేసీబీ సహాయంతో వాగు దాటించారు. సుమారు 500ల కుటుం బాల వరకు వాగు అవత లివైపు నివసిస్తుండగా భారీ వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుందని ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


చల్‌గల్ వద్ద బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న మోతె వాగు

బేసిక్ పే అమలు చేయాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసే వరకు బేసిక్ పే విధానం అమలు చేయాలని కోరుతూ జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంఆర్‌సీ భవనం నుంచి, కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో సమ్మె చేస్తున్న సమయంలో అప్పటి టీపీసీసీ ప్రెసిడెంట్ నేటి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులర్ చేయడంతో పాటు, అప్పటి వరకు బేసిక్ పే ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.


నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు

క్రైం వార్తలు

అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే చర్యలు

- నిబంధనలు అతిక్రమించిన ముగ్గురు డీజే నిర్వాహకుల అరెస్ట్

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిబంధలనకు విరుద్ధంగా డీజేలు నడుపుతూ పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సిరిసిల్ల పట్టణం పెద్దూరులో గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నిబంధలనకు విరుద్ధంగా డీజేను రోడ్డుకు అడ్డంగా పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే బ్లూకోల్ట్స్ సిబ్బంది వెళ్లి ఆపమని చెప్పినా ఆపకుండా విధులకు ఆటంకం కల్పించిన దొంతరవేణి నవీన్, దొంతరవేని మల్లేశ్, దొంతరవేణి రంజిత్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ ముగ్గురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

బైండోవర్ అతిక్రమించిన వారికి జరిమానా

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన ముగ్గురికి గురువారం జరిమానా విధించి, మరొకరికి వారెంట్ జారీచేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన లింగంపల్లి అనిల్(28) అనే యువకుడు మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేయడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ బైండోవర్‌ను అతిక్రమించి మళ్లీ ఇసుకను అక్రమ రవాణా చేసినందున అతనిపై కేసు నమోదుచేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా రూ. 15వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన బల్వీర్‌సింగ్ (42), చంద్రంపేటకు చెందిన సంపంగి మల్లవ్వ(53) బెల్ట్‌షాప్ నిర్వహించడంతో బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ అతిక్రమించి మళ్లీ అదే షాప్ నిర్వహించడంతో ఒక్కొక్కరికి తహసీల్దార్ రూ. 20వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన తుమ్మల శివకుమార్(21) అనే యువకుడు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మళ్లీ అదేవిధంగా చేసినందుకు అతనికి వారెంట్ జారీచేశారని టౌన్ సీఐ తెలిపారు. బైండోవర్‌ను ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించకూడదని, జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లో గతంలో పలు నేరాలకు పాల్పడడంతో ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట శుక్రవారం హాజరు పర్చడంతో జరిమానా విధించారని పేర్కొన్నారు. రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లోని అనరాశి కిష్టయ్య దొంగిలించిన ఇనుప సామగ్రి కొనుగోలు చేయడం, మద్యం అనుబంధ దుకాణాలను నిర్వహిస్తున్న బొమ్మనవేణి పర్శరాములు, మందాటి సతీష్‌ను గతంలో బైండోవర్ చేశామని చెప్పారు. బైండోవర్లను అతిక్రమించడంతో తహసీల్దార్ ఎదుట హాజరు పర్చగా కిష్టయ్యకు రూ25 వేలు, బొమ్మనవేణి పర్శరాములుకు రూ.25 వేలు, మందాటి సతీష్‌లకు రూ.10 వేలు జరిమానా విధించారని వివరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. అతిక్రమిస్తే జరిమానాలు విధించడంతో పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

భూ వివాదం కేసులో ఆరుగురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: తప్పుడు రిజిస్ట్రేషన్‌ద్వారా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, భూ వివాదాన్ని సృష్టించిన 21 మందిపై కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులు చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప నాగరాజు, దేశబోయిన శ్రీకాంత్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన నీరుమల్ల శ్యాంసుందర్ మానకొండూర్ పరిధిలోని సర్వే నంబర్ 1262, 1266లో రెండు ఎకరాల ఇరువయిన్నర గుంటల భూమిని దేశబోయిన బాలయ్య, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన శ్రీనివాస్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీకాంత్ నుంచి కొనుగోలు చేశాడు. ధరణి పోర్టల్‌లో పొరపాటున ఈ నలుగురిపేరిట నాలుగు ఎకరాల భూమికి బదులుగా ఏడు ఎకరాల పద్నాలుగున్నర గుంటల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదైంది. దానిని అదునుగా భావించి మోకాపై లేని భూమిని పలువురికి విక్రయించారు. నీరుమళ్ల శ్యామ్‌సుందర్‌కు విక్రయించిన భూమిలోని తొమ్మిది గుంటలను కొండా మురళి అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇది అన్యాయమనినీరుమల్ల శ్యాం సుందర్ నిలదీయగా 25 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్యాం సుందర్ కొన్న భూమిలోంచి ఎకరం రెండు గుంటలను చిట్టుమల్ల శ్రీనివాస్, అతని కుమారుడైన చిట్టుమల్ల అచ్యుత్‌చైతన్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయంపై శ్యాంసుందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న చిట్టుమల్ల శ్రీనివాస్ శ్యాంసుందర్‌ను కేసులు ఉపసంహరించుకోవాలని, సమస్యను తాను పరిష్కరిస్తానని చెప్పారు. దీంతో శ్యాంసుందర్ కేసులను ఉపసంహరించుకున్నాడు. తర్వాత పట్టించుకోలేదు. మళ్లీ సమస్యను పరిష్కరిస్తానని 11 గుంటల భూమిని బొల్లినేని సృజన్‌రావుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, అతని నుంచి తిరిగి కొత్త జైపాల్‌రెడ్డికి బదలాయించాడు. మరి కొంత భూమిని పట్టాదారులతో కుమ్మక్కై కొండా మురళి, వంగల సంతోష్, గంప ఫణీంద్రకు రిజిస్ట్రేషన్ చేశాడు. దీంతో నీరుమళ్ల శ్యాంసుందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపి చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప రమేష్, కొండా మురళి, వంగల సంతోష్ కుమార్, గంప నాగరాజు, గంప లవకుమార్, , గంప రవళి, వంగల గీత, గంప ఫణీంద్ర, యంసాని రాధా కృష్ణ, ఆకుల సుదర్శన, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన. శ్రీనివాస్, దేశబోయిన. గోపాల్, దేశబోయిన శ్రీకాంత్, రేగొండ సందీప్, మాకు వెంకట శారదా దేవి, బొల్లినేని సృజనరావు, కొత్త జయపాల్‌రెడ్డి, దువ్వంతుల లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.


నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు


యువకుడి ఆత్మహత్య

- ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో దారుణం

కోల్‌సిటీ, ఆగస్టు 30: గోదావరిఖని గంగానగర్‌కు చెందిన దాతు పవన్(25) అనే యువకుడు గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకు న్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... రామగుండం నగరపాలక సంస్థ 8వ డివిజన్ కార్పొరేటర్ దాతు శ్రీనివాస్ కుమారుడు పవన్ బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు ప్రయత్నించాడు. కొన్నిరో జుల పాటు ఉద్యోగం చేసి పవన్ మెరుగైన ఉద్యోగానికి ప్రయత్నించే క్రమంలో ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గుర య్యాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పవన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పవన్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ భూమేష్ తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు తదితరులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.


పవన్(ఫైల్)

గుప్త నిధుల కోసం తవ్వకాలు


గోపురానికి రంధ్రం చేసిన దుండగులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 30: మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ధర్మాబాద్‌లో ఉన్న ప్రాచీన కాలం అం డాలమ్మ దేవాలయ గోపురాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం ధ్వంసం చేశారు. దేవాలయ గోపురానికి రంధ్రం చేసి నిచ్చె న ద్వారా అందు లో గుప్త నిధుల కోసం వెతికి నట్లు అనవాళ్లు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోరుట్ల, ఆగస్టు 30: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెట్‌పల్లి మండల కోనరావుపేట గ్రామానికి చెందిన ఎనుగు గంగారెడ్డి (58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మూడు రోజుల క్రితం వాహనాలు ఢీకొన్న సంఘటనలో గంగారెడ్డితో పాటు పశువైద్య కళాశాలకు చెందిన విద్యార్థి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహకారంతో వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గంగారెడ్డి గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసులో రెండేళ్ల జైలు

ధర్మారం, ఆగస్టు 30: మండల కేంద్రానికి చెందిన రాగుల మల్లేశం అనే నేరస్తుడికి వేధింపుల కేసులో శుక్రవారం నందిమేడారం కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎన్ వెంకటసచిన్‌రెడ్డి రెండేళ్ల పాటు జైలు, రూ.6వేలు జరిమానా విధి స్తూ తీర్పు ఇచ్చారు. తేది. 2.12.2015న రాగుల శ్రీలత తన భర్త మల్లేశం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను వేధిస్తున్నాడని తన అత్త లక్ష్మి, మామ రాజయ్యలు మద్దతు పలుకుతున్నారని ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. శుక్రవారం సాక్షులను విచారించిన జడ్జి నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసుల కొరడా

- సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గల డైలీ ఫైనాన్స్, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లు, ఆఫీసుల్లో పోలీసులు దాడులు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సిరిసిల్ల టౌన్, వేములవాడ టౌన్, తదితర అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వడ్డీ వ్యాపారస్తులు, డైలీ ఫైనాన్స్ వ్యాపారస్థుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో పలు ప్రామిసరీనోట్లు, డాక్యుమెంట్లను, చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాన్య ప్రజలను అధిక వడ్డీల పేరిట ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరమైన పద్ధతులతో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే ప్రజలు నమ్మాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపేవారి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు 16 మందిపై కేసు నమోదు చేసి 8.60లక్షల నగదుతో పాటు 43 బ్లాంక్ చెక్కులు, 36 ప్రామీసరి నోట్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.


సిరిసిల్లలో వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన గాద గణేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. అవసరం ఉన్న వారికి డబ్బు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు గాద గణేశ్ ఇంటిలో శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు ఖాళీ చెక్కులు, 15 ప్రామిసరీ నోట్లు, ఓ వర్జినల్ ఆర్సీ పేపర్ లభించాయి. దీంతో గాద గణేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

ఏఈవోకు సన్మానం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 30 : బ్రాహ్మణపల్లి వ్యవసాయ క్లస్టర్ ఏఈవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన శ్వేతను శుక్రవారం కనగర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. కనగర్తి మాజీ ఎంపీటీసీ ఎడెల్లి శంకరయ్య, అప్పన్నపేట సింగిల్‌విండో డైరెక్టర్ యెల్లంకి స్వామి, ఎల్కపల్లి సతీస్, గున్నాల రాములు, యెల్లెంకి రాయమల్లు, మడుపు నరసింహారెడ్డి, కండె లింగయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

వైన్స్ షాపులపై చర్య తీసుకోవాలి

మంథని, ఆగస్టు 30: మున్సిపల్ పరిధిలో ఎన్నో ఏళ్ళుగా ట్రేడ్ లైసెన్స్ లేని వైన్స్ షాపులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు బూడిద గణేష్ శనివారం తెలిపారు. ప్రజల నుంచి ఇళ్లు కట్టుకోవటానికి ఇంటి పరిమిషన్ తోపాటు ఇంటి పన్ను, నల్లాబిల్లు, చెత్తట్యాక్స్ వసూలు చేస్తున్న అధికారులు ఇంతకాలం ఎలాంటి లైసెన్స్ లేకుండా వైన్స్ షాపులు నడుపుతూ లక్షలు సంపాదిస్తున్న వ్యాపారులపై విచారణ జరిపి ట్యాక్స్ వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

మంథని, ఆగస్టు 30: స్థానిక 11వ వార్డులోని సత్యసాయి నగర్‌లో ఫ్లాట్ నం.15,12 మున్సిపల్ లీజుదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు పుల్లె అనిల్ శనివారం తెలిపారు. అక్రమ నిర్మాణాల పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సీనియర్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

మంథని, ఆగస్టు 30: స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో సీనియర్‌ఇన్‌స్పెక్టర్ పల్కల సురేందర్‌రెడ్డిని చైర్మన్ కొత్త శ్రీనివాస్ శుక్రవారం సన్మానించారు. ఇటీవల ఆయన మంథనికి బదిలీపై రాగా సన్మానించారు. సంఘం కార్యదర్శి మామిడాల అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులను కాపాడాలని వినతి

మంథని, ఆగస్టు 30: మంథని నియోజకవర్గంలో కబ్జాకు గురైన చెరువులను, కుంటలను, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం వినతిపత్రం ఇచ్చినట్లు బెజ్జంకి డిగంబర్, బూడిద తిరుపతిలు తెలిపారు. ఎక్కడ కబ్జాలు గురైన వాటి గుర్తించి వారి పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులను సంసిద్ధం చేయండి

మంథని, ఆగస్టు 30: ఎన్‌ఏఎస్-2024 పరీక్ష కోసం విద్యార్థులను సంసిద్ధం చేయాలని మండల నోడల్ అధికారి ఎన్. హరిప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బృందం తమ పాఠశాల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంలో నిర్ణీత స్థాయిలో ఉంచడానికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డాక్టర్ సురేష్ కుమార్, టీ. శ్రీలత, సీఆర్‌పీలు టీ. మల్లన్న, సుప్రజ, రాధికలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలను ప్రభుత్వం గుర్తించాలి

ఎలిగేడు, ఆగస్టు 30 : మండలంలోని 12గ్రామాల్లో పని చేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలను గుర్తించి శిక్షణ తరగతులు ఇప్పించాలని ఆకస్మిక దాడులను అరికట్టాలని శుక్రవారం డుప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ప్రాథమిక వైద్యురాలు నిస్సిక్రిష్టానకు వేరువేరుగా వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందిస్తున్న మమ్ములను గుర్తించడంలేదన్నారు. ఎస్ఎంసీ, డీఎంహెచ్‌వో, ఆర్‌ఎంపీ, పీఎంపీలపై చేస్తున్న దాడులను వారు ఖండించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు గర్రెపల్లి రాజేశం, అట్టేపల్లి కనుకయ్య, శ్రీనివాస్, కవ్వంపల్లి సంపత్, రమేష్, కుమార్, గర్రెపల్లి నారాయణస్వామి పాల్గొన్నారు.

వేద పాఠశాల ప్రధాన ఆచార్యుడికి సన్మానం

కాల్వ శ్రీరాంపూర్, ఆగస్టు 30: మండల కేంద్రంలోని జగత్ మునీశ్వరస్వామి ఆలయ ఆవరణలోని వేద పాఠశాలలో ప్రధాన ఆచార్యుడిగా పనిచేస్తున్న తిప్పర్తి సత్యాచార్యులు వేద విద్యా సామ్రాట్ బిరుదుకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డు తెలుగు సంస్కృత సాహితీ సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో వేద విద్య సామ్రాట్ బిరుదుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కాల్వశ్రీరాంపూర్ వేద పాఠశాలను నిర్వహిస్తున్న వ్యవస్థాపకులు జగత్ మహామునేశ్వర స్వామి ఆశ్రమ పీఠాధిపతులు రాజమౌళీశ్వరస్వామి చేతుల మీదుగా శుక్రవారం సత్కరించారు.

మైక్ సెట్ వితరణ

సుల్తానాబాద్, ఆగస్టు 30: సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయిలో పెద్దమ్మ గుడికి బీజేపీ నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్ మైక్‌సెట్‌ను శుక్రవారం అందజేశారు. ఆలయ కమిటీ విన్నపం మేరకు తాను మైక్ సెట్ అందిస్తున్నట్లు బీజేపీ నాయకులు సదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు సదయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్టల రామస్వామి, ఉపాధ్యక్షులు పోచమల్లు, పిట్టల రమేష్, తిరుపతి, చందు, మేకల చిన్న రాజయ్య, చేరాలు, కొమురయ్య, రాజమౌళి, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

కుల వివక్ష చూపితే కఠిన చర్యలు



గుండారంలో పాల్గొన్న అధికారులు



గుడిపల్లిలో మాట్లాడుతున్న ఆర్ఐ రాజబాబు

కమాన్‌పూర్, ఆగస్టు 30 : గ్రామాల్లో కుల వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు హెచ్చరించారు. మండలంలోని గుండారం గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నేటికి కులవివక్ష చూపుతున్నారని, తమ దృష్టికి సమస్య వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామంలోని ప్రజలందరూ కలిసిమెలసి ఉండాలన్నారు. రెండు గ్లాసుల విధానాన్ని, ఆలయాల్లో ప్రవేశం నిషేదం వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ జంపయ్య, కానిస్టేబుల్ వెంగళ శ్రీనివాస్, అంబేద్కర్ సంగం నాయకులు అంబటి కనకయ్య, రామచంద్రం, సీఆర్‌పీ తణుకు ప్రభాకర్, ఉరి రాజయ్య, దామెర గట్టయ్య, నందం తదితరులు ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : సుందిల్ల గ్రామంలో శుక్రవారం ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం జరిగింది. ఈసమావేశంలో గోదావరిఖని ఎస్సై ఫరీద్ మాట్లాడారు. దేశంలో పౌరులందరికి రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని, అసమానతలు రూపుమాపాలని ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలులోకి తెచ్చినట్టు తెలిపారు. కుల వివక్షకు గురైన బాధితు లు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మహేష్, బూడిద సమ్మయ్య, మేకల సురేష్, కాసిపేట సంతోష్ పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని గుడిపల్లిలో శుక్రవారం మండల రెవెన్యూ అధికారులు పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఐ రాజబాబు మాట్లాడుతూ పౌర హక్కులపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి సంతోష్, బసంత్ నగర్ ఎఎస్ఐ సత్యనారాయణ,కానిస్టేబుల్ శ్రీనివాస్, కారోబార్ మామిడాల శ్రీనివాస్,మండల రెవెన్యూ కార్యాలయం అటెండర్లు జుపాక స్వామి,కాసార్ల తిరుపతి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎలిగేడు : చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నర్సాపూర్‌లో శుక్రవారం సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంటరాని తనం అమానుషమని కంప్యూటర్ యుగంలో అలాంటి వాటికి తావు లేకుండా చూడాలని ప్రజలందరికీ చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ జగదీశ్వర్, ఆర్ఐ జయలక్ష్మి, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి అంజయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్, పీసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, ఆశాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : అంటరానితనాన్ని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ గర్రెపల్లి శంకర్ హాజరై మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి పౌరుడు సమానత్వంతో మెలగాలన్నారు. కులమత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్నేహభావంతో ఉండాలన్నారు. ప్రభుత్వం దళితుల కోసం ప్రవేశ పెడుతున్న పథకాలను వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ అత్యున్నత స్థాయికి ఎదగాలని, అందరూ చదువుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేందర్, ఎంపీఓ గోవర్ధన్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జూలపల్లి : మండల కేంద్రంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బషీరొద్దిన్, మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి నాగయ్య, కార్యదర్శి ముజాముద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలకు దోహదపడాలి

- జిల్లా విద్యాధికారి మాధవి



దివ్యాంగ విద్యార్థులకు టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేస్తున్న డీఈవో

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 30 : దివ్యాంగ విద్యార్థుల సామర్థ్య పెంపుదలకు తల్లిదండ్రులు ఇంటి వద్ద, పాఠశాలలో ఉపాధ్యాయులు దోహదపడాలని పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని భవిత కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ జాతీయ మేధో దివ్యాంగ వ్యక్తుల సాధికారిత సంస్థ సికింద్రబాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న మేధో దివ్యాంగ విద్యార్థుల బాలబాలికలకు మొత్తం 15 మందికి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్లు జిల్లా విద్యాధికారి మాధవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ పంపిణీ చేసిన టీఎల్‌ఎం కిట్లను వృధా చేయకుండా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఈపీఐడీ సంస్థ కోఆర్డినేటర్ లకన్‌బాబు, మండల విద్యాధికారి సురేంద్రకుమార్, జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ అజిమొద్దిన్, విలీన విద్య రిసోర్స్ ఉపాధ్యాయులు, సీఆర్పీలు, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాబోధన చేస్తూ విద్యార్థుల స్థాయిని పెంచండి

ఎలిగేడు, ఆగస్టు 30 : శిక్షణకు అనుగుణంగా విద్యాబోధన చేస్తూ విద్యార్థుల స్థాయిని పెంచాలని డీఈవో మాధవి సూచించారు. శుక్రవారం ఆమె ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల కాంప్లెక్స్ ట్రైనింగ్‌ను సందర్శించారు. మల్టీ గ్రేడ్ మల్టీలెవల్ టీచింగ్ ఆదర్శ బోధనను పరిశీలించారు. ఉపాధ్యాయులు పొందిన శిక్షణకు అనుగుణంగా విద్యాబోధన పాఠశాలలో చేస్తూ విద్యార్థుల స్థాయిని పెంచాలని సూచించారు. అనంతరం ఎలిగేడు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ప్రతినెల మూడవ శనివారం జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులను తీసుకోరావాలన్నారు. ఉపాధ్యాయులు, మీతల్లిదండ్రులతో మాట్లాడి ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించే విధంగా చూస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గండ్ర దేవేందర్‌రావు, నరేంద్రచారి, సదానందం, సీఆర్‌పీ లక్ష్మీనారాయణయ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు లేని రైతులు వివరాలను నమోదు చేసుకోవాలి

ఓదెల, ఆగస్టు 30 : మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ కార్డు లేని 998 మంది రైతులను గుర్తించడం జరిగిందని, ఇంకా మిగిలిన ఉన్న రేషన్ కార్డులు లేని, అలాగే రుణమాఫీ వర్తించని రైతులు తమ సమీపాల్లోని రైతు వేదికల్లో వివరాలను నమోదు చేయించుకోవాలని ఏవో భాస్కర్ కోరారు. 31న పొత్కపల్లి రైతు వేదికలో ఉదయం 8 నుంచి వివరాల నమోదు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ వేదికలో శానగొండ, జీలకుంట, రూపునారాయణపేట రైతులు నమోదు చేసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 2న, గుంపులలో గూడెం, ఇందుర్తి, బయమ్మపల్లి, రైతులకు వివరాల నమోదు ఉంటుందని, 3న, గోపరపల్లి, హరిపురం, ఉప్పరపల్లి గ్రామాలను కలిపి కొలనూర్ రైతువేదికలో, అలాగే 4న పిట్టలఎల్లయ్యపల్లి, మడక, కనగర్తి, గ్రామాలను కలుపుకొని గుండ్లపల్లి రైతువేదికలో నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలి

సుల్తానాబాద్, ఆగస్టు 30: ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను, డీఏలను విడుదల చేయాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గర్రెపల్లి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గండు కృష్ణమూర్తిలు ముఖ్యఅతిథిగా హజరయ్యారు. పీఆర్‌టీయు మండల నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వై మహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా శివశరణం, మహిళా ఉపాధ్యక్షురాలిగా సమత, మండల కార్యదర్శిగా కుమారస్వామి ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రవినందన్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మురుగు కాల్వను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రమసురేష్‌రెడ్డి

మంథని, ఆగస్టు 30: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను మున్సిపల్ పరిధిలోని ప్రజలు పాటించాలని చైర్మన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి సూచించారు. ఫ్రై డే డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీపాదకాలనీ, ఎరుకలగూడెం, చైతన్యపురి కాలనీలో శుక్రవారం ఆమె పర్యటించి పలు వాడలను పరిశీలించారు. నీటి నిల్వలను తొలగించారు. ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైఎస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు, సిబ్బంది ఉన్నారు.

సింగరేణి ఉద్యోగి నేత్రాలు దానం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 30: ఆర్జీ-2 ఏరియాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నల్లవెల్లి కనకయ్య మరణించగా ఆయన నేత్రాలు దానం చేసి ఆదర్శంగా నిలిచారు కుటుంబ సభ్యులు. గుండెపోటుతో కనకయ్య గురువారం మృతి చెందగా, సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్ర దానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో కనకయ్య నేత్రాలను దానం చేయడానికి వారు అంగీకరించారు. ఎల్‌వీ ప్రసాద్ టెక్నీషియన్ సతీష్ కనకయ్య నేత్రాలను సేకరించి ఐబ్యాంక్‌కు తరలించారు. ఇంటిపెద్దను కోల్పోయిన బాధలో సైతం మరో ఇద్దరి అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని కాంక్షించి నేత్రదానానికి అంగీకరించిన కనకయ్య కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కనకయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు.

వృద్ధురాలి నేత్రాలు..

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 30: గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీకి చెందిన తోట పోచమ్మ(78) అనే వృద్ధురాలు గురువారం సాయంత్రం అనారోగ్యంతో మరణించగా ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. బీజేపీ నాయకుడు కందుల పోచం మృతురాలి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు స్పందించారు. సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కెఎస్ వాసు ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ ఐబ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ సతీష్‌కుమార్ పోచమ్మ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

మొక్కలు నాటిన ఎన్‌సీసీ కేడెట్లు



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కేడెట్లు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 30: గోదావరిఖని సెక్రెడ్ హర్ట్ హైస్కూల్‌లో శుక్రవారం పచ్చదనం-పర్యావరణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రెడ్ హర్ట్ ఫాదర్ రాయప్పరెడ్డి, ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించాలన్నారు. మానవాళి మనుగడకు మొక్కలు, చెట్లే కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్లు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టికలా, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ఓదెల, ఆగస్టు 30 : మండలంలోని కొలనూర్ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు 120 రకాల మొక్కలు నాటారు. పాఠశాలలో 110 మంది విద్యార్థుల్లో ఇద్దరికి ఒక మొక్క చొప్పున 55 గ్రూపులుగా చేసి నాటిన మొక్కలను సంరక్షించుటకు దత్తత ఇచ్చినట్లు హెచ్‌ఎం ఏసుదాసు తెలిపారు.

ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షీటీమ్‌పై అవగాహన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 30: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామగుండం కమిషనరేట్ షీటీమ్, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం షీటీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఏఎస్ఐ మల్లయ్య, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ స్నేహలత వివిధ విభాగాల పనితీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డయల్ 100, టీ సేఫ్ యాప్, సైబర్ క్రైమ్ 1930, షీటీమ్ వాట్సప్ నెంబర్ 6303923700కు సమస్యలను తెలియజేయాలని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఏ సాంబశివరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ బీ.తిరుపతి, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ డి.కిరణ్మయి, డాక్టర్ నరేష్, శ్రీదేవి, రామకృష్ణ, సురేష్, అజయ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 30: సైబర్‌క్రైమ్‌పై యువత అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై నీలిమ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్యాల గ్రామ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు, గంజాయి, డ్రగ్స్, సైబర్‌క్రైమ్, మైనర్లు వాహనాలు నడుపుట, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు గురించి ఏఎస్ఐ వివరించారు. విద్యార్థులకు పలు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది అశోక్, రజిని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారి ఔదార్యం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 30: మండల కేంద్రంలోని అడవిచెరువు బాట ఏర్పాటుకు రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పుప్పాల విక్రమ్ నరసింహారావు రైతులకు సాయం అందించారు. పెద్ద రాతిపెల్లి శివారులోని హుస్సేన్ మియా వాగు పరివాహప్రాంతం నుంచి అడవి చెరువుకు రైతులు వెళ్లేందుకు రహదారి సరిగా లేకపోవడంతో, విశ్రాంతి పోలీస్ ఆఫీసర్ విక్రమ్ నరసింహారావు రహదారి బాగు కోసం రైతులకు జేసీబీ మిషన్‌తో రహదారిని బాగు చేయించడంతో పాటు నీరు ఉన్నచోట రైతులకు పైపులు అందజేశారు. ఈ పనుల కోసం సుమారు రూ.2.2లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఈ రహదారికి ఉపాధి హామీ పనుల ద్వారా శాశ్వతంగా మెటల్ రోడ్డు వేయించాలని రైతులు కోరుతున్నారని తెలిపారు. రహదారి పనులకు సహాయ సహకారాలు అందించిన విక్రమ్ నరసింహారావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీపీసీలో ముగిసిన ఎస్‌జీఎఫ్ జోనల్ మీట్

జ్యోతినగర్, ఆగస్టు 30: ఎన్టీపీసీ టీటీఎస్ జడ్పీ పాఠశాల మైదానంలో ఈనెల 28 నుంచి జరుగుతున్న ఉమ్మడి రామగుండం మండలం జోనల్ స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. రెండు రోజులపాటు బాలబాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్‌లో పోటీలు జరుగగా చివరి రోజు బాల,బాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించారు. రామగుండం ఈస్ట్, వెస్ట్, పాలకుర్తి, అంతర్గాం మండలాలకు చెందిన అండర్ 14, 17 విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీ లక్ష్మణ్(పీఈడీ), ఆర్గనైజింగ్ సెక్రెటరీ భోభారాణి(పీఈడీ), ఎన్టీపీసీ జెడ్పీ స్కూల్ పీఈడీ జావెద్ బహుమతులు అందజేశారు. క్రీడా పోటీలు విజయవంతం చేయడంలో కృషి చేసిన పీఈడీ జావెద్‌ను ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు లక్ష్మణ్, శోభారాణి అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలం ఎంఈవో ఆరెపల్లి రాజయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అర్హులు రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కమాన్‌పూర్, ఆగస్టు 30: అర్హులైన ప్రతి రైతు రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి గిరిరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో రుణమాఫీ కాని రైతుల కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించారు. రుణమాఫీ కాని రైతులు దిగాలు చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ముఖ్యంగా రైతులు పూర్తి వివరాలను వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు. 80 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో అనూషతో పాటు రైతులు ఉన్నారు.

రత్నాపూర్‌లో వ్యవసాయశాఖ కుటుంబ నిర్ధారణ

రామగిరి, ఆగస్టు 30: మండలంలోని ఆదివారంపేట్ గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం కుటుంబ నిర్ధారణ ప్రక్రియ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో భాగంగా గ్రామానికి చెందిన రైతులు రేషన్‌కార్డులేని కుటుంబ సభ్యుల రేషన్ కార్డులు, ఆధార్‌కార్డు,ధ్రువీకరణ పత్రాలను మండల ఏవో శ్రీకాంత్ సేకరించారు. అనంతరం రుణమాఫీకి సంబంధించిన పత్రాలను ఆప్‌లో అప్లోడ్ చేశారు. ఏఈవో అరవింద్, మౌనిక రైతులు పాల్గొన్నారు.



వృత్తి శిక్షణా తరగతులను ప్రారంభించిన జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 30: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి శిక్షణా తరగతులను శుక్రవారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రారంభించారు. కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మాట్లాడారు. సింగరేణి కుటుంబాలకు చెందిన మహిళలు, ప్రభావిత పరిసర గ్రామాల మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలనే లక్ష్యంతో వివిధ రకాలైన వృత్తివిద్యాకోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు, పారిశ్రామిక ప్రాంత యువత కోసం ప్రత్యేకంగా నైపుణ్య అభివృద్ధి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా సింగరేణి చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదగాలని జీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, అధికారులు రాజేంద్రప్రసాద్, షరీఫ్ మహమ్మద్, వేణుగోపాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, సేవా కోఆర్డినేటర్ దేవారెడ్డిలతో పాటు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గని కార్మికుల సమస్యలపై విక్రమార్క స్పందించాలి

గోదావరిఖని, ఆగస్టు 30: సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై శనివారం గోదావరిఖనికి వస్తున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.30వేల కోట్ల బకాయిలను ఇప్పించాలన్నారు. సంస్థ లాభాలను ప్రకటించి 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని ఆయన కోరారు. కార్మికుల సొంత ఇంటి కోసం 240గజాల స్థలాన్ని, ఇల్లు నిర్మాణానికి రూ.20లక్షల వడ్డీ లేని రుణాన్ని కార్మికులకు ఇప్పించాలని, ఈ అంశంపై భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు జీఓ నెం.22ను అమలు చేయించి ఉద్యోగ భద్రతపై హామీ ఇవ్వాలని ఆయన అన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘానికి గుర్తింపు పత్రం ఇప్పించాలని, సింగరేణి నిధులను పూర్తి స్థాయిలో సింగరేణి ప్రాంతంలోని వెచ్చించాలని డిమాండ్ చేశారు. వేలం పాటలు లేకుండా కొత్త గనులను సింగరేణికే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని నర్సింహారావు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, గౌస్, దాసరి సురేష్, శంకర్, తాళ్ల శ్రీనివాస్, జనార్ధన్, సత్యనారాయణ, సంపత్, నర్సింహారావు, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

బదిలీ వర్కర్లకు సీఎండీ తీపి కబురు

- 2364 మందిని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ

గోదావరిఖని, ఆగస్టు 30: సింగరేణిలో పని చేస్తున్న బదిలీ వర్కర్లకు సీఎండీ బలరాంనాయక్ తీపి కబురు అందించారు. 2364మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించారు. ఈ మేరకు సింగరేణి భవన్ నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. సెప్టెంబర్ 1 నుంచి ఈ మొత్తం మంది బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా కొనసాగనున్నారు. ఆగస్టు 30వరకు సింగరేణిలో పనిచేస్తున్న మొత్తం 2364మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించారు. సింగరేణిలో చేరినప్పటి నుంచి ఏడాదికి భూగర్భ గనుల్లో 190మస్టర్లు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 మస్టర్లు చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ చేస్తున్నట్టు సీఎండీ వెల్లడించారు. ఈ మేరకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా డైరెక్టర్(పా)కు సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించడం పట్ల కార్మికుల్లో హర్షం వ్యక్తంఅయ్యింది. సింగరేణిలో కారుణ్య నియామకాల ప్రక్రియలో సింగరేణిలో ఉద్యోగం పొందిన వారిని సంస్థ బదిలీ వర్కర్లుగానే నియమిస్తుంది. ఏడాదికాలం పని చేసిన తరువాత కనీస మస్టర్లు పూర్తి చేస్తే జనరల్ మజ్దూర్లుగా శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తుంది. దీంతో ఉన్నత విద్యార్హత కలిగిన వారిని సంస్థలో జరిగే పదోన్నతుల్లో అర్హత లభిస్తుంది. క్వార్టర్ల కేటాయింపులో కూడా ప్రాధాన్యత పెరుగుతుంది. జనరల్ మజ్దూర్లుగా పదోన్నతి పొందిన వారంతా క్రమశిక్షణతో, అంకిత భావంతో పని చేయాలని ఈ సందర్భంగా సీఎండీ కార్మికులను కోరారు. ఉద్యోగాల కోసం ఎందరో ఉన్నత విద్యావంతులు ఎదురు చూస్తున్న వేళ సింగరేణిలో ఇంత మంచి అవకాశం దొరికిన జనరల్ మజ్దూర్ కార్మికులు విధులకు గైర్హాజర్ కాకుండా సమయపాలన పాటించాలని కోరారు. ఈ సంవత్సరంలో సంస్థ ఆధ్వర్యంలో వెయ్యికి పైగా ఇంటర్నల్ పోస్టులను భర్తీ చేయబోతున్నామని, అర్హులైన వారు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. బదిలీ వర్కర్ల నుంచి జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించబడిన కార్మికులు కార్పొరేట్ ఏరియాలో 25మంది, కొత్తగూడెంలో 17మంది, ఇల్లందులో 9మంది, మణుగూరులో 21మంది ఉన్నారు. అలాగే 476మంది, ఆర్జీ-1లో 563 మంది, ఆర్జీ-2లో 50మంది, ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టులో 240మంది, శ్రీరాంపూర్‌లో 655మంది, మందమర్రిలో 299మంది, బెల్లంపల్లిలో 9మంది కార్మికులు ఉన్నారు.

కొత్త గనుల విషయంలో స్పష్టత ఇవ్వాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

గోదావరిఖని, ఆగస్టు 30: సింగరేణిలో కొత్త బొగ్గు గనుల తవ్వకాలను అనుమతులు తీసుకువచ్చే విషయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టత ఇవ్వాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొంటారా లేదా, కేంద్రంతో సంప్రదించి సింగరేణికే ఆ బొగ్గు బ్లాకులు కేటాయించేలా చర్యలు తీసుకుంటారా లేదా అనే విషయాన్ని సింగరేణి ప్రాంతానికి వస్తున్న విక్రమార్క స్పష్టం చేయాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గత సంవత్సరం 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణి కనీసం రూ.4వేల కోట్ల లాభాన్ని ఆర్జించే అవకాశం ఉన్నదని, ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదుమాసాలు అయినప్పటికీ లాభాల వాటా ప్రకటించకపోవడం విడ్డూరమన్నారు. లాభాల వాటా ప్రకటించి కార్మికులకు 35శాతం వాటాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గడిచిన ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగా కార్మికుల ఆదాయ పన్నులను సింగరేణియే చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని చేశారు. పెర్క్స్‌పై విధించే ఆదాయపన్ను తక్షణమే కార్మికులకు ఇప్పించాలన్నారు. కార్మికులకు 250గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ ఇల్లు నిర్మించుకోవడానికి రూ.20లక్షల వడ్డీ రుణ సౌకర్యం కల్పించాలని, ఇచ్చిన హామీని ఎప్పటినుంచి నెరవేరుస్తారో చెప్పాలన్నారు. విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, నాయకులు చెలుకలపెల్లి శ్రీనివాస్, పల్లె సురేందర్, బొగ్గుల సాయి, పులిపాక శంకర్, రొడ్డ సంపత్, గండు శ్రావణ్, కొమురయ్య పాల్గొన్నారు.